క్లుప్తంగా

రైతు సంక్షేమమే ధ్యేయం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న పాలకవర్గ సభ్యులు

హుస్నాబాద్: రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందేలా కృషి చేస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కంది తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా బంక చందుతో పాటు పాలకవర్గసభ్యులు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వ్యాపారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని మార్కెట్ యార్డులోనే అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలన్నారు. బహిరంగ కొనుగోళ్లు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్కెట్‌లో రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. మరింత అభివృద్ధిలోకి తీసుకు వస్తామన్నారు.

క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజం



మెమొంటో బహూకరిస్తున్న నిర్వాహకులు

సిద్దిపేటజోన్: ఆటలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక క్రికెట్ స్టేడియంలో ఆరో రోజైన బుధవారం కూడా నిర్వహించిన మ్యాచ్‌లలో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఇంకా మరి కొన్ని రోజులపాటు పోటీలు జరపుతామన్నారు. పోటీల వల్ల క్రీడా నైపుణ్యాలను మరింత పెంపొందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రతినిధులు మహేశ్, కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా జనార్దన్



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, సమ్మయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్వతి సత్యనారాయణ బుధవారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పన్యాల జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండి సమ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగేశ్వర్లు, గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా మల్లేశం, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌లుగా రాజు, నరేశ్, రమేశ్, జిల్లా కార్యదర్శులుగా ప్రవీణ్, తిరుపతిలను నియమించినట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న కృష్ణమూర్తి

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లికి డెంగీ బాధితుడు మస్కు రాజిరెడ్డికి చెందిన సామాజికవేత్త బాల్‌రాజ్ కృష్ణమూర్తి బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశాడు. గ్రామంలోని పేదవారికి తన వంతుగా సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పిస్తూ సామాజిక సేవ చేస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యం, ప్రమాదాల కారణంగా ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స కోసం శక్తికి మించి డబ్బులు ఖర్చు పెట్టిన పేద వారు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచరం మేరకు మండలంలోని లద్నూరు, కొండాపూర్, జాలపల్లి గ్రామాల్లో అక్రమంగా నడుపుతున్న బెల్ట్ షాపులలో దాడులు నిర్వహించి పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మద్యం స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



చౌటకుంటతండా సమీపంలో దెబ్బతిన్న తారురోడ్డు



రోడ్డుకు ఆనుకొని ఉన్న భగీరథ గేట్ వాల్, విద్యుత్ స్తంభాలు

బీటీ రోడ్డు నాణ్యత డొల్ల!

- నిర్మించిన కొద్దిరోజులకే పగుళ్లు
- పర్యవేక్షణ లోపమే కారణమని తండావాసులు ఆరోపణ

అక్కన్నపేట(హుస్నాబాద్): తారు రోడ్డు వేసిన వారం, పది రోజులకే తారులేచింది. అప్పుడే పగుళ్లు రావడం ఏమిటని తండావాసులు ప్రశ్నిస్తున్నారు. అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామ వైకుంఠథామం నుంచి చాటకుంటతండా మీదుగా బోరింగ్‌తండా వరకు దాదాపుగా 2.5 కిలో మీటర్ల మేర ఇటీవల తారురోడ్డు వేశారు. నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా కాంట్రాక్టర్ నిర్మించాడని తెలిసింది. రోడ్డుకు ఒక వైపు మిషన్ భగీరథ గేట్ వాల్, విద్యుత్ స్తంభాలు అనుకొని ఉన్నాయి. ఇరువైపులా సైడ్‌బర్మలు వేయలేదు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే అక్కడక్కడ తారు లేచి పోతుందని తండావాసులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో గిరిజన శాఖ రూ.1.90 కోట్ల నిధులను మంజూరు చేయడం తెలిసిందే.

ఎన్నాళ్లో వేచిన సమయం..

- పదేళ్ల తర్వాత మున్సిపల్ బిల్డింగ్‌కు మోక్షం
- నూతనంగా నిర్మాణమైన మున్సిపల్ భవనం
- మంత్రి పొన్నం చేతులమీదుగా నేడు ప్రారంభోత్సవం



నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం

పదేళ్ల తర్వాత మున్సిపల్ బిల్డింగ్‌కు మోక్షం కలిగింది. సరిపడా నిధులు లేమి.. స్థల కేటాయింపులో సమన్వయం లోపం.. ఇలా ఎన్నో అవంతరాల నుంచి బయట పడి ఎట్టకేలకు నూతన కార్యాలయ భవనం నిర్మాణమైంది. నేడు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.

హుస్నాబాద్: హుస్నాబాద్ ఒక కుగ్రామం నుంచి గ్రామపంచాయతీగా ఎదిగింది. కాలాను గుణంగా మేజర్ గ్రామ పంచాయతీ, నగర పంచాయతీ, మున్సిపల్‌గా రూపాంతరం చెందింది. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 30వేలకు పైగా జనాభా. అంగడి వేలం ద్వారా వచ్చే నిధులతో పాటుగా యేటా పన్నుల రూపంలో రూ.2.40 కోట్లకు పైగానే ఆదాయం సమకూరుతుంది. ఢిల్లీ వేదికగా స్వచ్ఛ సర్వేక్షణ్ కింద రెండు సార్లు జాతీయ అవార్డులు, రాష్ట్ర స్థాయిలో అవార్డును కైవసం చేసుకుంది. నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయింది. అప్పటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసింది. అనువైన స్థలం లేకపోవడంతో నిర్మాణంలో ఆలస్యమైంది. పట్టణానికి దూరంలో సబ్ స్టేషన్ సమీపంలో మున్సిపల్ భవన నిర్మాణానికి ఎకరం స్థలం ఓ దాత దానం చేశారు. పాలకవర్గ సభ్యుల మధ్య సమన్వయం కొరవడి పట్టణానికి దూరంలో నిర్మించవద్దని కొందరు అడ్డు తగిలారు. ధర్నాలు చేశారు. దీంతో స్థల కేటాయింపునకే ఐదేళ్లు గడిచింది. చివరకు మండల పరిషత్ ఆవరణలో నిర్మించాలని సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. 8 ఫిబ్రవరి 2022లో అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావులు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కలిసి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రూ.6 కోట్లతో అత్యాధునికంగా నిర్మాణం

భవనం డబ్బులు రూ.50 లక్షలను బ్యాంక్‌లో డిపాజిట్ చేయగా రూ.1కోటి వరకు పెరిగింది. టీయూఎఫ్ఐడీసీ గ్రాంట్ నుంచి విడతల వారీగా రూ.5కోట్లు సమకూరాయి. ఈ రూ.6 కోట్లు వెచ్చించి భవనాన్ని అత్యాధునికంగా నిర్మించారు. జీ ప్లస్ టూ పద్ధతిలో నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్‌కు వదిలిపెట్టారు. మొదటి అంతస్తులో మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ల చాంబర్లతో పాటుగా ఇంజనీరింగ్, రెవెన్యూ, పారిశుద్ధ్య, కంప్యూటర్ ఆపరేటింగ్, మెప్మా డిపార్ట్‌మెంట్‌లకు వేర్వేరుగా గదులను కేటాయించారు. రెండో అంతస్తులో సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 20 మంది పాలకవర్గసభ్యులు, నలుగురు కో ఆప్షన్ సభ్యులున్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని 60 మంది సభ్యులు కూర్చొనేలా సీట్లు, ప్రతీ సభ్యుడికి మైక్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. వచ్చే జనవరి మాసంలో పాలకవర్గ పదవీ కాలం ముగుస్తోంది. ఈ భవనాన్ని గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

సంతోషంగా ఉంది



మా హయాంలో అత్యాధునీకరంగా నిర్మించిన కొత్త మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా భవనాన్ని నిర్మించాం. ఐదేళ్లు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామనే తృప్తి ఉంది.

– ఆకుల రజిత, మున్సిపల్ చైర్‌పర్సన్, హుస్నాబాద్

మెనూ తప్పనిసరిగా పాటించాల్సిందే

ఎంఈఓ కిష్టయ్య



మాట్లాడుతున్న ఎంఈఓ కిష్టయ్య

చేర్యాల(సిద్దిపేట): మధ్యాహ్న భోజన నిర్వహణపై మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో కలిసి ఎంఈఓ రచ్చ కిష్టయ్య సమావేశం నిర్వహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్ఎంలకు వివరించారు. ప్రధానంగా వంటగది, పరిసరాలు, వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలపాలన్నారు. కూరగాయలను శుభ్రంగా కడిగి వండేలా చూసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలన్నారు. ప్రతీ పాఠశాలలో కరివేపాకు, మునగ చెట్లను నాటేలా చూడాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ముస్త్యాల మోడల్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ మహ్మద్ సమీర్ అమీద్ ఖాన్, ఎంపీడీఓ మహబూబ్‌అలీ, స్పెషల్ ఆఫీసర్ నాగరాజు పాల్గొన్నారు.

బైక్, లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): ద్విచక్రవాహనం, లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రగాయాల పాలయ్యారు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం చౌటపల్లి క్రాసింగ్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్లంపల్లికి చెందిన యువకుడు బడుగు రాజు ద్విచక్రవాహనంపై హుస్నాబాద్‌కు వెళ్తున్నాడు. హుస్నాబాద్ నుంచి అక్కన్నపేటకు లారీ వస్తోంది. చౌటపల్లి క్రాసింగ్ వద్దకు రాగానే రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో రాజు కాళ్లకు తీవ్ర గాయం కాగా 108లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొమురవెల్లి(సిద్దిపేట): అనుమతి లేకుండా తాటిచెట్లను జేసీబీ సహాయంతో తొలగించిన ఇద్దరిపై కేసు నమోదైంది. ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కిష్టంపేటలో సర్వే నంబరు 257లో పట్టాదారులైన కొత్తపల్లి రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి దేశ మంతరెడ్డిలు ఎలాంటి అనుమతి లేకుండా పది తాటిచెట్లను జేసీబీతో తొలగించారు. దీనిపై గ్రామ గౌడ సంఘం నాయకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

త్వరితగతిన ధాన్యాన్ని తరలించాలి



వడ్లను పరిశీలిస్తున్న డీపీఎం కరుణాకర్

నంగునూరు(సిద్దిపేట): రైతుల వద్ద కొనుగోలు చేసిన వడ్లను వెంటనే తరలించాలని ఐకేపీ డీపీఎం కరుణాకర్ నిర్వాహకులకు సూచించారు. అంక్షాపూర్‌లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో నంగునూరు మండలంలో ఏడు వడ్ల కొనుగోలు కేంద్రాల ద్వారా 829 మంది రైతుల నుంచి 31 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఆయన వెంట ఏపీఎం మహిపాల్, సీసీలు లింగం, సాయిలు, విజయ్, జ్యోతి, సంధ్య తదితరులు ఉన్నారు.

పూర్వవైభవానికే సంకల్ప దీక్ష

జేఏసీ చైర్మన్ పరమేశ్వర్



మాట్లాడుతున్న పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): ప్రజల ఎజెండాతోనే ఈ ప్రజా సంకల్ప దీక్ష చేపడుతున్నామని జేఏసీ చైర్మన్ డా.రామగళ్ల పరమేశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నెల 30న చేపట్టనున్న ప్రజా సంకల్ప దీక్షా స్థలాన్ని జేఏసీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. చేర్యాల ప్రాంత ప్రజల ఎజెండా ఆకాంక్షను సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ దీక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. ఎంతో ఘనకీర్తి చాటుకున్న చేర్యాల ప్రాంతం 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో అస్తిత్వాన్ని కోల్పోయిందన్నారు. తిరిగి ఈ ప్రాంతానికి పూర్వవైభవం తీసుకురావడం కోసం ఈ నెల 30న పట్టణ కేంద్రంలో ప్రజాసంకల్ప దీక్ష చేపట్టినట్లు తెలిపారు. నాలుగు మండలాల నుంచి ఇంటికొకరు చొప్పున తరలివచ్చి మన ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. స్థల పరిశీలనలో జేఏసీ నాయకులు ఆగం రెడ్డి, కొండల్‌రెడ్డి, అశోక్, బీరయ్య, రవి, మల్లేశం, మహేందర్, చంద్రయ్య, రాకేశ్‌కృష్ణ, రమణారెడ్డి, కృష్ణాగౌడ్, భాను, లక్ష్మీనారాయణ, భూమయ్య, భాస్కర్, సంతోశ్‌రెడ్డి, బాల్‌రాజు, మహేశ్, భాస్కర్ రెడ్డి, ప్రసాద్, సదానందం తదితరులున్నారు.

సీఎం సారూ.. మాకిచ్చిన హామీనెరవేర్చరూ..



కేజీబీవీ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మినిమం టైం స్కేల్ కోసం కేజీబీవీ ఉద్యోగుల నిరసన

హుస్నాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కేజీబీవీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారిస్తామని పీసీసీ హోదాలో వచ్చి హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు నెరవేర్చలేదని జిల్లా కన్వీనర్ హేమలత అన్నారు. టీఎస్‌టీఎఫ్ పిలుపు మేరకు బుధవారం హుస్నాబాద్ కేజీబీవీ పాఠశాలలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అధికారంలోకి వచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేస్తామని మాట ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా హామీ అమలు కాలేదన్నారు. 15 ఏళ్ల నుంచి చాలిచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి మినిమం టైం స్కేల్ ఇవ్వడంతో పాటు అందరికీ హెల్త్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు దశలవారీగా పోరాటం చేపడుతామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మమతయాదవ్, హేమలత, సంధ్య, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీహెచ్ గ్రూపులకు 'పాడిగేదెల యూనిట్లు'

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్



పాడిగేదెలను పరిశీలించి సూచనలిస్తున్న డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య

వర్గల్(గజ్వేల్): ఇందిరా మహిళా శక్తి శ్రీనిధి ద్వారా స్వయం సహాయక సంఘ(ఎస్‌జీహెచ్) మహిళలు పాడిగేదెల యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం వర్గల్ మండలం గౌరారంను ఆయన సందర్శించారు. అక్కడ శ్రీనిధి ద్వారా కొనుగోలు చేసిన 12 గేదెలు, ఆవుల యూనిట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత మహిళా సభ్యులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. నిధులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభ్యున్నతి సాధించాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈజీఎస్ ద్వారా క్యాటిల్ షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఆయన వెంట డీపీఎం వాసుదేవ్, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఎం ఆనంద్‌కుమార్, ఏపీఓ జనార్దన్, సీసీలు పద్మలత, సత్యనారాయణ, సుభాశ్, వీఓఏ స్వరూప, టీఏ తిరుపతిరెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ కరుణాకర్, కార్యదర్శి శ్రీనివాస్, సంఘ అధ్యక్షురాలు సంతోష పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ ఎల్.శ్రీను అన్నారు. బుధవారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ప్రగతి విద్యానికేతన్ స్కూల్‌లో బాలికలు, మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బాలికలు, మహిళల రక్షణ కోసం చట్టాలు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రధానంగా సెల్ ఫోన్ వినియోగం దాని పర్యవసానాలు, బాల్య వివాహాలు దాని పరిణామాలు, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాలు, సోషల్ మీడియా దాని పరిణామాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలను ఎవరైనా వేధిస్తే, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడితే, ఉద్దేశ పూర్వకంగా వెంబడిస్తే వెంటనే డయల్ 100, షీటీమ్ వాట్సాప్ నంబర్ 8712667434, మహిళా పోలీస్‌స్టేషన్ 87126-67435 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ డివిజన్ షీటీమ్ బృందం సైదయ్య, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి మండల ప్రకటనపై హర్షం



మాట్లాడుతున్న దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌స్వామి గౌడ్

మిరుదొడ్డి(దుబ్బాక): జీఓ 67 ద్వారా అక్బర్ పేట–భూంపల్లిని పూర్తి స్థాయి మండలంగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి గౌడ్ తెలిపారు. అక్బర్‌పేట–భూంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి చేతులు దులుపుకొందని విమర్శించారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే మండలానికి మండల వ్యవసాయ కార్యాలయం, మండల వనరుల కేంద్రంతో పాటు, ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయాన్ని సైతం ఏర్పాటు చేసి పూర్తి స్థాయి మండలంగా ప్రకటించిందన్నారు. గ్రామాల ప్రజలకు పూర్తి స్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బాలుయాదవ్, ప్రతాప్, నాయకులు శ్రీధర్, రవీందర్‌రెడ్డి, వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్, ముత్యాలు, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

భారీ వాహనం బోల్తా



రాజీవ్ రహదారి పక్కన బోల్తా పడిన భారీ వాహనం

కొండపాక(గజ్వేల్): మట్టి ఇటుకల లోడుతో వెళ్తున్న భారీ వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటన కుకునూరుపల్లి స్టేషన్ పరిధిలోని కొడకండ్ల గ్రామ రాజీవ్ రహదారిపై బుధవారం జరిగింది. మట్టి ఇటుకల లోడ్‌తో జగదేవ్‌పూర్ వైపు నుంచి కొడకండ్ల గ్రామం వైపునకు వస్తోంది. ఈ క్రమంలో మలుపు వద్ద తిప్పుతుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో టైర్ దిగి వాహనం బోల్తా పడింది. డ్రైవరు ముందుగానే దూకి ఈ ప్రాంతం నుంచి పారిపోయాడు. ఈ ఘటన వల్ల రాజీవ్ రహదారిపై కొద్ది సేపు ట్రాఫిక్ జామ్ కాగా పోలీసులు వెళ్లి క్లియర్ చేశారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రత్యేక స్టాల్స్‌ను సందర్శించండి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాల ప్రదర్శన ఉంటుందని, దాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక బుధవారం తెలిపారు. ఈ పరికరాల ప్రదర్శనలో 150 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ పరికరాలు, సార పంపులు, స్థానిక సాంకేతికతలు, క్రిమి సంహారక మందులు, వ్యవసాయ పరికరాలు, వ్యవసాయ డ్రోన్లు, ఆవిష్కరణాత్మక వ్యవసాయ పరికరాలు, తేనెటీగలు, మష్రూమ్, చేపలు, పట్టు పురుగుల పెంపకం గురించి ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అధిక పాలు ఇచ్చే జెర్సీ, ఒంగోలు జాతి పశువులు, వివిధ జాతుల గొర్రెలు, మేకలు, ఔషధ మొక్కలు, సుగంధ మొక్కలు, వివిధ రకాల కూరగాయలు, పుష్పాలు, విత్తనాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

◆ ప్రజాపరిషత్ ఏర్పాటు నిర్ణయం హర్షణీయం



మద్దూరు(హుస్నాబాద్): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్ అన్నారు. బుధవారం దూల్మిట్ట మండలానికి ప్రజాపరిషత్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డిలు ఉన్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ చిత్రలేఖనంలో విద్యార్థుల సత్తా



హుస్నాబాద్‌రూరల్: ఇటీవల ఎన్‌టీపీసీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో హుస్నాబాద్ సాంఘిక గురుకుల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ శ్యామలత బుధవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థి సాత్విక్, ఎల్. అరవిక్‌లు పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుపొందడంపై పలువురు అభినందించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990